# ప్రజాసేవ చేస్తావా...?

"ఐలూరి"



ఓ రోజున ఉదయం ఆరు గంటలయి ఉంటుంది. లేద్దాం లేద్దాం అనుకుంటూ బద్ధకంగా ముసుగు బిగించాను బుడమేరు కట్టతెగివచ్చిన వరదనీరు ఇంటి చుట్టూ నిలిచి చీదరగా ఉంది ఇంతలో

'అక్కయ్యా" అనే పిలుపు వినబడింది

మా ఆవిడ ఎక్కడో దొడ్లో నీళ్లల్లో డెట్టాల్ కలిపి పిల్లలకి స్నానాలు చేయిస్తోంది పిలుపు వినబడలేదు

'అక్కయ్యా మళ్లీ పిలుపు ఈ సారి ఈ పిలుపు చాలా దగ్గరగా వినబడింది అప్పటిగ్గానీ నా మత్తు వదలలేదు. ఆ వచ్చింది మా బావమరిది విద్యాసాగర్ అని నాకు అర్థం అయింది మా మామగారు తన కొడుకుని అపర సరస్వతిని చేద్దాం అని అనుకుని ఆ పేరు పెట్టారు కానీ బస్తీ షోకులతో జులాయిగా తయారయి, ఆయన్ను ఆశోపహతుడిగా తయారు చేసాడు.

పొద్దున్నే దిగబడ్డాడేంటా అనుకుంటూ తెల్లవారినా కుడుతున్న దోమను చంపుదామని పక్కకి ఒత్తిగిల్లాను.

"బావా లేచావా" అంటూ సరాసరి నన్నే పలకరించాడు తలవైపునున్న కుర్చీలో కూర్చుని.

ఇక తప్పదనుకుని అప్పుడే మెలకువ వచ్చిన వాడిలాగా.

ఎప్పుడొచ్చావోయ్ సాగరూ" అంటూ ఆవలించాను.

ఇంతలో మా ఆవిడ చంటివాడిని ఒక చేత్తో రెండో అమ్మాయిని మరొక చేత్తో పుచ్చుకుని బరబరా మధ్య గదిలోకి వచ్చింది. ఎదురుగా తమ్ముణ్ణి చూసిన ఆనందంతో ఆవిడ ముఖం ఎగిరిపోయిన ఇంటికప్పుమీది రేకు అంతయింది

"ఏరా ఎంతసేపయింది వచ్చి అంది పిల్లల్ని బరాబరా తుడుస్తూ

'ఇప్పుడే వచ్చా నక్కయ్యా' అన్నాడు వినయంగా అతగాడి వినయం నాకు ఆశ్చర్యాన్ని మా ఆవిడకి ముచ్చటనీ కలిగించింది

'ఇంటి దగ్గిర అందరూ కులాసానా అనడిగింది వాళ్ళక్కయ్య

"తెలియదక్కయ్యా నేను మద్రాసు నుండి వస్తున్నా' అన్నాడు నావంకే చూస్తూ

నేను మా ఆవిడవంక చూసి చిన్నగా నవ్వుదామని అనుకున్నాను కానీ నవ్వు రాలేదు

"అయితే నీకు సినిమా ఛాన్సులు రాలేదన్నమాట అన్నాను కాస్తంత ధైర్యం కూడదీసుకుని

"వచ్చాయి కానీ . " ఆగిపోయాడు మధ్యలో.

"కానీ ఏమిటి అని రెట్టించింది మా ఆవిడ ఇంటి పట్టున ఉండకుండా తిరుగుతున్న తమ్ముడిమీద కాస్త చిరాకు కూడా కలిగిందావిడకి.

"వరదలొచ్చాయిగా అందుకని ." ఆగిపోయాడు నావంక చూసి

"ఊ అందుకని . ' రెట్టించక తప్పలేదు నాకు

"వరద బాధితులకు సాయపడదామని వచ్చాను అన్నాడు ఒక్కగుక్కలో తలొంచుకుని


మా ఆవిడ తమ్ముణ్ణి నిలువుగుడ్లేసుకు చూస్తూండి పోయింది. నాక్కూడా మాట వెంటనే పెగిలి రాలేదు

మా గ్రామంలో "ఉత్తమ జులాయి వెధవ" పోటీలు పెడితే దానిలో మా సాగరే మొదటి బహుమతి కొట్టేస్తాడు. తరువాత జిల్లాస్థాయి పోటీ పెట్టినా రాష్ట్రస్థాయి, జాతీయ అంతరా తీయ స్థాయిలో కూడా మావాడు. ఉత్తమ జులాయి వెధవగా ప్రథమస్థానం కొట్టేస్తాడు. అటువంటివాడు వరద బాధితులకు సహాయం చేస్తానంటుంటే ఎవరికి మాత్రం మరోవిధంగా అనిపిస్తుంది

డబ్బులు చేజిక్కాయంటే మద్రాసు పారిపోయే మావాడు ఇలా అంటుంటే నాకు ఎందుకో మొదటిసారిగా గమ్మత్తయిన భయం వేసింది. ఎందుకనో అసంకల్పితంగా పక్కనే ఉన్న ఇనప బీరువా వంక చూసాను తాళం చెవులగుత్తి తలుపుకి వేళ్లాడుతోంది మా ఆవిడ వంక చూసాను ఆమె కూడా కొంచెం భయపడుతున్నట్టు అనిపించింది అప్పుడు తాపీగా మా బావమరిదివైపు చూసాను. నావంకచూసి ఫెళ్లున నవ్వాడు.

'అక్కయ్యా మీ భయం నా కర్థం అయింది ఇంతవరకూ మా ఇంట్లో డబ్బులు నేను పట్టుకెళ్లానేగానీ ఎవరింటిలోనూ ఒక పైసా కూడా తీసుకోలేదు కనీసం అప్పుగానైనా సరే' అన్నాడు టక టకా

నిజమే అనిపించింది నాకు అయినా అంత ధాటీగా ఎలా చెప్పగలిగాడు అనిపించింది నాకు




## హింసకు ప్రతిఫలం

ఆధునిక విమర్శకులు కొందరు రామాయణాన్ని విమర్శిస్తూ దండకారణ్యంలో నివసిస్తున్న రాక్షసులనబడే వారు ఆ అరణ్య నివాసులనీ, వారక్కడ పొలాలు దున్నుకుంటూ జీవించే వారనీ– వారిని శ్రీరాముడు హింసించడం సముచితంగా ఉన్నట్లు తోచదనీ అభిప్రాయ పడుతున్నట్లు తోస్తున్నది. మునులు కూడా తపస్సు చేసుకుంటూ వనంలో నివసించే వారు. ప్రశాంత జీవులయిన ఆ మహనీయులు ఒకరి జోలికి పోకుండా తమకు లభించిన ఫల మూలాదులను తిని జీవించేవారు. నిరాపేక్షులయిన ఆ మహర్షులు అతిథి పూజలు మానేవారుకారు. ఆతిథ్య భ్యాతులను ఆదరించి గౌరవించడం ఉత్తమ ధర్మంగా వారు భావించేవారు. తమ ఆశ్రమాలకు చుట్టుప్రక్కల ఉన్న నేలల్లో నెవ్వరి ధాన్యాన్ని పండించి, ఆ ధాన్యాన్ని అతిథుల కోసం భద్రపరచే వారు.

ఈ మునులపై పైన చెప్పిన ఆటవిక రాక్షసులకు ద్వేషం. వీరి తపస్సులవల్లా వీరు చేసే యాగాలవల్లా తమకు ఉపద్రవం కలుగు తుందనే భయంతో అవి జరగకుండా ఉండుటకు శాయశక్తులా ప్రయత్నించేవారు. మునులను హింసిస్తే, వారు ఆ ప్రాంతాలు విడిచి పోగలరనీ, వారి భూములు తాము స్వాధీనం చేసుకోవచ్చుననీ కూడా వారు అనుకునేవారని కూడా ఊహించవచ్చును. వీరి బాధలు పడలేని మునులు శ్రీరామునితో మొరపెట్టగా అతడు వారిని శిక్షించడం, సంహరించడం జరిగేది. తపోవృత్తి నున్న ఆ మహనీయుడు కారణం లేకుండా అరణ్య వాసులయిన రాక్షసులను హింసించినట్లు భావించడం పొరపాటు. వారు, తాము చేసిన హింసకు ప్రతి హింస అనుభవించేవారు.

మంచితనం కాని, చెడ్డతనం కాని మనిషిని బట్టి ఉంటుంది కాని, జాతిని బట్టి ఉండదు. రాక్షసులన్నంత మాత్రాన వారంతా క్రూర స్వభావులని చెప్పలేము. విభీషణుని వంటి ఉత్తములు వారిలో లేకపోలేదు. అశోకవనంలో జానకీదేవికి కాపువలగా ఉన్న రాక్షస స్త్రీలలో త్రిజట వంటి ఉత్తమ వనితలూ ఉండేవారు. రావణుడు సీతను అపహరించి లంకను తీసుకొని రావడం కొందరికి ఎంత మాత్రం ఇష్టం లేదు. కాని, చండశాసనుడైన తమ ప్రభువునకు భయపడి ఏమీ అనలేక పోయారు.

రావణ కుంభకర్ణాదులు, మారీచుడు మున్నగు వారు, తామొనరించిన అన్యాయాలకు తగిన ప్రతిఫలం అనుభవించారు. అపకారానికి వెంటనే కాక పోయినా మరొకప్పుడయినా తగిన ప్రతిఫలం ఉంటుంది. దీనిని ఎవ్వరూ కాదనలేరు.

రామరావణ యుద్ధం కేవలం వ్యక్తులకు సంబంధించినది మాత్రమే అని అనుకోకూడదు. శ్రీరామచంద్రుని విజయం అధర్మం పయి ధర్మం సాధించిన విజయమే అని భావించవలసి ఉన్నది.

బులుసు వేంకటరమణయ్య

## ప్రజాసేవ చేస్తావా?

వీడు జలాయి వెధవయినా దేశాలు తిరిగి ఏదో కొంత జ్ఞానాన్ని సంపాదించాడు అని సరిపెట్టుకున్నాను.

"అయితే మంచిదే అలాగే చెయ్యి" అన్నాను "దానికి నువు కొద్దిగా సాయం చెయ్యాలి వచ్చే ఎన్నికల్లో నేనుగాని గెలిస్తే నీ సాయం ఊరికే మర్చిపోను" అన్నాడు.

నాకు వాడి మాటలు వినగానే భూనభోంతరాళాలు ఏకం అయినట్లుగా అనిపించింది. వరదలు, బాధితులు, సహాయం, ఎన్నికలు, జలాయి వెధవ గెలవడం, కృతజ్ఞత ఇలా రకరకాల మాటలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఎందుకో ఒక్కసారిగా నాకు ఆఫీసు, అందులో పని గుర్తొచ్చి తక్షణకర్తవ్యం బోధపడిలేస్తూ....

"అలాగే నీకు తోచినట్లు చెయ్యి ఇందులో నేను చెయగలిగింది ఏముంది" అన్నాను.

మా ఆవిడ తమ్ముడి మాటలకి దిమ్మరపోయి అసంకల్పితంగానే పిల్లల్ని స్కూలుకు తయారు చేస్తోంది.

"గోదావరీ స్టోర్స్ ప్రొప్రయిటర్ నీ ఫ్రండ్‌గదా ఆయనతో ఒక్క ముక్క చెబితేచాలు. మిగిలిన పనంతా నేను చేసుకుంటాను."

"ఏం చెప్పమంటావు" అన్నాను నిండా మునిడిగాననిపించి.

"వరదబాధితులకు ఇవ్వడానికిగాను కొన్ని సరకులు మా క్కావలసినవి ఇస్తే వాటిని మళ్లీ పావు గంటలో తిరిగి ఇచ్చేస్తాం ఈ సాయం చేస్తే చాలు."

"వాళ్లకి ఏం చేసినవి తిరిగి పావుగంటలో ఎలా ఇస్తావు? అసలు పావుగంటలో వాటిని కొట్నించి తేవడమే కుదరదుగదా" అంది మా ఆవిడ ఎక్కడ కొంప ముంచుతాడోనని భయం భయంగా.

నాకూ అనుమానం వేసింది.

అప్పుడు మా వెర్రి ముఖాలు చూసి మా బావమరిది గీతోపదేశం చేసాడు.

"ఏమీలేదు బావా ఆ సామానంతా అంటే దుప్పట్లు, ధోవతులు, పాలడబ్బాలు, చీరలు, బియ్యం అన్నీ పేర్చి నా నాయకత్వంలో పంచిపెడుతున్నట్లుగా ఓ ఫోటో దిగుతాను. నా వెనకాల ఓ పదిమంది కుర్రాళ్లు నా ఫ్రెండ్స్ ఉన్నార్లే వారిలో కొందరు బాధితులు లాగా చీరలు, ధోవతులు, బియ్యం అందుకుంటారు నాలుగైదు ఫోటోలు దిగుదాం. తరువాత సరకులు మీ ఫ్రండ్‌కి అప్పజెప్పేసి ఫోటోలు తీసుకుని. వాటిని అన్ని పేపర్లలోనూ ప్రముఖంగా వేయిస్తాను.

అప్పుడు వాటిని మా పార్టీ నాయకునికి చూపించి నేను ఇంత సేవ చేసాను. ఇంత ఖర్చు చేసాను. నా వెనక ఇంతమంది ఉన్నారు కనుక నాకు పార్టీ టికెట్టు వచ్చే ఎన్నికల్లో ఇవ్వాలని గట్టిగా అడుగుతాను. దానికి మా వాళ్లందరూ సిఫార్సు చేస్తారు" అని ముగించాడు.

మా బావమరిది వాగ్ధాటికి, తెలివికి కంగారుపడి కొబ్బరినూనె సీసా కాస్తా నేలమీద దభీమని వదిలేసింది మా ఆవిడ.

మా బావమరిది నన్ను చూసి అదో రకంగా నవ్వాడు. నాకు రాజకీయ నాయకుడి నవ్వుతప్ప రక రకాల వృత్తులవారి నవ్వు తెలుసు. ఈ నవ్వు నాకు కొత్తగా ఉంది.

అప్పుడే ఎన్నికల్లో గెలిచి మా బావమరిది మంత్రి పదవి కూడా చేపట్టినట్లనిపించింది. □